manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 01 | సంచిక : 237 | గురువారం | 06.03.2025



సభ్య సమాజం తలదించుకునే దారుణమైన ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంటోంది. శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆర్యవైశ్య సత్రం వెనుక ఓ పాడు బడిన బావిలో గోవులు కళేబరాలు బయటపడడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఆ ప్రాంతంలో పొదల్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గమనించగా.. పదుల సంఖ్యలో గోవుల కళేబారాలు దర్శనమిచ్చాయి. ఆయా గోవుల కళేబరాలను చూసి స్థానికులు ఒక్కసారిగా షాక్ అయ్యారు.

# 'మూగ' రోదన..!

## ఈ పాపం ఎవరిది?

### తిండి, రక్షణ లేక రాలిపోతున్న గోవులు

### గోశాల పేరుతో బీమా దందా!

**పాలకుర్తి, మన చౌరాస్తా :**

సోమన్న దేవస్థానంలో పనిచేస్తున్న ఓ అర్చకుడిగా ప్రైవేట్‌గా గోశాల నిర్వహిస్తున్నాడు. అప్పుడప్పుడు గోవులను పట్టుకున్న పోలీసులు.. సంరక్షణ కోసం పాలకుర్తిలోని ఈ గోశాలకు వాటిని అప్పగిసున్నారు. అయితే గోవులకు సరైన రక్షణ, తినడానికి మేత లేక ఆకలితో అలమటిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో కొన్ని రోజులుగా పదుల సంఖ్యలో గోవులు మృతి చెందడంతో వాటిని ఎవరకీ తెలయకుండా ఆర్యవైశ్య సత్రం వెనుక ఉన్న పాడు బడిన బావిలో పడిసినట్టు తెలిసింది.

### ఇన్సూరెన్సు కోసమేనట..!

చనిపోయిన గోవుల విషయంలో మరో విచిత్ర వాదన కూడా విపించడం విస్మయానికి గురిచేస్తుంది. హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఇన్సూరెన్సు కంపెనీతో ఒప్పందాలు కుదుర్చుకుని గోవులకు ఇన్సూరెన్స్ చేయిస్తున్నారని తెలిసింది. చనిపోయిన తర్వాత ఒక ట్రెండు రోజుల్లో వాటి ఇన్యూరెన్స్ క్లైమ్ చేసుకుంటున్నారని తెలుస్తోంది. ఇలా పెద్ద మొత్తంలో డబ్బులు కాజేస్తున్నారని స్థానికుల నుండి బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం గోశాల పేరుతో దందా నిర్వహిస్తూ గోవులకు రక్షణ కల్పించకుండా క్లైమ్ డబ్బుల కోసమే చంపుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని రహస్యంగా ఆర్యవైశ్య సత్రం వెనుక ఉన్న పాడు బడిన బావిలో వేయడం లేదా పక్కనే ఉన్న చెరువులో జేసీబీ సహాయంతో పెద్దపెద్ద గుంతలు తీసి పూడ్చి పెడుతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అధికారులు వెంటనే స్పందించి ఆయా గోశాల నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని గో సంరక్షణ కార్యకర్తలు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులను వివరణ కోరగా తమ దృష్టికి వచ్చిందని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని సమాధానం ఇచ్చారు.




## సార్.. సెల్ఫీ ప్లీజ్..!

విద్యార్థుల్లో పరీక్షలంటే భయాన్ని తొలగించేందుకు నిర్వహిస్తున్న 'విజయోస్తు' కార్యక్రమంలో భాగంగా బుధవారం జనగామ జిల్లాలోని తరిగొప్పల జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. తమతో మమేకమైన కలెక్టర్‌తో సెల్ఫీ దిగేందుకు విద్యార్థులు ఇలా ఎగబడ్డారు.




### 16న స్టేషన్‌ఘన్‌పూర్‌కు

## సీఎం రేవంత్‌రెడ్డి

- వివరాలు వెల్లడించిన ఎమ్మెల్యే కడియం

4



### ప్రశాంతంగా ప్రారంభమైన

## ఇంటర్ పరీక్షలు

- సెంటర్లను తనిఖీ చేసిన అధికారులు

3




### మానవత్వం చాటుకున్న

## పోలీసులు

- విద్యార్థులకు సాయమందించిన సీఐలు

3

General News

# ఎల్ఆర్ఎస్ ప్రక్రియ షురూ

- నిబంధనలకు అనుగుణంగా ఉన్న ప్లాట్లకు ఆటోమేటిక్‌గా ఫీజు ఖరారు
- తిరస్కరిస్తే.. పునఃపరిశీలనకు అవకాశం
- 25 శాతం రాయితీ గొప్ప అవకాశం
- మార్చి 31లోగా ఫీజు చెల్లించాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, మన చౌరాస్తా :** ఎల్ఆర్ఎస్ కింద ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను రాష్ట్ర పురపాలకశాఖ ప్రారంభించింది. నిషేధిత జాబితాలో లేని సర్వే నంబర్లలోని ప్లాట్లకు ఆటోమెటిక్ ఫీజు చెల్లింపు పత్రాల జారీ సోమవారం నుంచి మొదలుపెట్టింది. ఏవైనా కారణాలతో దరఖాస్తులు తిరస్కారానికి గురైతే.. పునఃపరిశీలనకు అవకాశమిచ్చింది. దీంతో నాలుగేళ్లుగా ఎల్ఆర్ఎస్‌కు ఎదురుచూస్తున్న ప్రజలకు వెసులుబాటు లభించనుంది. ఈ నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ 25 శాతం రాయితీ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. స్థలాల క్రమబద్ధీకరణ లో 25 శాతం రాయితీ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. సంబంధిత సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఈ సేవలను పొందవచ్చునని, మార్చి 31 లోపు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సందేహాల నివృత్తికి జిల్లా కలెక్టరేట్లో సహాయ కేంద్రం నెంబర్ 9948187334, జనగామ పురపాలక సహాయ కేంద్రం నెంబర్ 8978207205 లో సంప్రదించవచ్చునని తెలియజేశారు. గురువారం ఉదయం 11 గంటలకు పురపాలక కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పైన అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. సందేహాలు ఉన్న ప్రతీ ఒక్కరు ఈ అవగాహన కార్యక్రమానికి హాజరై నివృత్తి చేసుకోవచ్చన్నారు.



# పంచసూత్రాలను పాటించాలి

**ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులవ్వాలి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**తరిగొప్పుల, మన చౌరాస్తా :** విద్యార్థుల్లో పరీక్షలంటే భయాన్ని తొలగించి, ఉత్తేజాన్ని కలిగించేందుకు చేపడుతున్న విజయోస్తు కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లాలోని తరిగొప్పుల జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మండల స్థాయి ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడు ఈ మండలం నుంచి వంద శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. పది పరీక్షలకు మరో 15 రోజుల సమయం మాత్రమే ఉందని, ప్రాధాన్యత కలిగిన అంశాలపై పట్టు సాధించే దిశగా నిరంతర సాధన చేయాలన్నారు. ఏదేని సబ్జెక్టులో వెనుకంజలో ఉన్న విద్యార్థులు ఈ 15 రోజుల్లో మరింత కష్టపడితే తప్పకుండా ఉత్తీర్ణులవుతారని, రేపటి నుంచి జరిగే ప్రీఫైనల్ పరీక్షలకు మంచిగా సన్నద్ధమవ్వాలన్నారు. సమయాన్ని ఏ మాత్రం వృథా చేయొద్దని, పరీక్షలో ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాలన్నారు. గత ప్రశ్నపత్రాల ద్వారా కచ్చితమైన అంశాలను గుర్తించాలన్నారు. దానికి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ప్రతి విద్యార్థి పంచ సూత్రాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. సమయానుకూలంగా నిద్ర, చదువు, ఆరోగ్యం చూసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మమేకమై వారందరికీ వార్షిక పరీక్షల శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకు ముందు గణితం, విజ్ఞాన శాస్త్రంలోని పలు అంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. అందుకు విద్యార్థులు ఇచ్చిన సరైన సమాధానాలతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఈఓ రమేష్, ఎంపీడీవో దేవేందర్, జీసీడీఓ గౌసియా బేగం, ఏఎంఓ శ్రీనివాస్, ఎంఈఓ జానకి దేవి, ప్రిన్సిపాల్ రవీందర్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం తనిఖీ

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలోని ఈవీఎం గోదాంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా నమోదు పుస్తకం, సీసీ కెమెరాల పని తీరు, మంటల నియంత్రణ పద్ధతులను పర్యవేక్షించారు. ఈవీఎం వీవీ ప్యాట్లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్ల నిర్వహణలో పారదర్శకంగా వ్యవహరించాలని, భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని పోలీసు సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట వివిధ పార్టీల ప్రతినిధులు బి. భాస్కర్, ఏ.విజయ భాస్కర్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీకాంత్, ఇతర ఎన్నికల సిబ్బంది ఉన్నారు.



# యూడీఐడీ ఏర్పాటుకు కసరత్తు

- జీజీహెచ్‌ను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

**జనగామ టౌన్, మన చౌరాస్తా :** దివ్యాంగుల యూడీఐడీ విభాగం ఏర్పాటుకు అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ స్థానిక జీజీహెచ్‌ను పరిశీలించారు. సదరం సర్టిఫికెట్ విధానానికి బదులుగా.. నూతనంగా యూడీఐడీ కార్డుల జారీ కోసం జిల్లా కేంద్రాల్లో ఏర్పాట్లు చేపట్టాలని సెర్ప్ ప్రధాన కార్య నిర్వహణాధికారి దివ్య దేవరాజన్ ఆదేశించడంతో బుధవారం అదనపు కలెక్టర్ జిల్లా జనరల్ హాస్పిటల్ ను సందర్శించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ రావు తో కలిసి యూడీఐడీ విభాగం ఏర్పాటుకు కావాల్సిన పనులు చేపట్టేందుకు హాస్పిటల్ 2వ అంతస్తులో గల ఖాళీ ప్రదేశాన్ని పరిశీలించారు. జిల్లా జనరల్ హాస్పిటల్ లో విభాగం ఏర్పాట్లపై అందుకు కావల్సిన సిబ్బంది, వనరుల కేటాయింపు తదితర ఏర్పాట్లపై వైద్యులతో చర్చిస్తూ ఖాళీ ప్రదేశాలను, వైద్య నిపుణులకు కావాల్సిన గదులు పరిశీలించారు. అనంతరం వసతి సదుపాయలపై డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి దివ్యాంగునకు యూడీఐడీ నంబర్ ను కేటాయించాల్సి ఉన్నందున ప్రత్యేక విభాగం తప్పక అవసరమని అన్నారు.



# ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**నల్లగొండ, మన చౌరాస్తా :** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నర్సింగ్ భట్లలో బుధవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పడంతో పాటు కలెక్టర్, డీఈవో, ఎంఈవోలుగా పాఠశాలకు రావడం పలువురిని ఆకట్టుకుంది. విద్యార్థులే ఉపాధ్యాయులుగా చక్కటి పాఠశాలను బోధించారు. కలెక్టర్‌గా, డీఈవోగా , ఎంఈవోగా పాఠశాలను సందర్శించి పరిశీలించడం, తనిఖీలు చేయడం ఆకట్టుకుంది. అలాగే పాఠశాల పాటు ఉపాధ్యాయులుగా విద్యార్థులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# విద్యార్థులే ఉపాధ్యాయులై..

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పాలన దినోత్సవం జరిగింది. విద్యార్థులు పి.సందీప్ ప్రధానోపాధ్యాయులుగా, బి.శ్రీజ, కె.తేజశ్రీ, బి.దనుష్, ఇ.కౌషిక్ ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా మండల విద్య శాఖాధికారి జి.కొమురయ్య హాజరై విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిక్కుడు శ్రీనివాస్ ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పి.రాజు, అంగన్వాడీ టీచర్ సరోజ పాల్గొన్నారు.

Local News



# ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

- 203 మంది విద్యార్థులు గైరాజరు
- పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**జనగామ టౌన్, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలో ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా జనరల్ , ఒకేషనల్ విభాగాలకు కలిపి మొత్తం 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు 4,481 మంది విద్యార్థులు పరీక్షలు హాజరు కావాల్సి ఉండగా 4,275 హాజరయ్యారు. 203 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రిజ్వాన్ భాషా, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జితేందర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టగా, పాలకుర్తిలో పరీక్షా కేంద్రాలను డెక్ సభ్యులు పరిశీలించారని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జితేందర్ రెడ్డి తెలిపారు.









## మానవత్వం చాటుకున్న పోలీసులు

**జనగామ టౌన్, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంతో పాటు, స్టేషన్‌ఘన్‌పూర్‌లో సరైన పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సిన విద్యార్థులు అయోమయానికి గురై మరో పరీక్షా కేంద్రాలకు చేరుకోగా సకాలంలో స్పందించిన జనగామ సీఐ దామోదర్ రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ సీఐ వేణు విద్యార్థులను తమ వాహనాలలో సకాలంలో పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లి మానవత్వం చాటారు. పోలీసుల స్పందించిన తీరుకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలుపగా, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.








## అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి

**నల్లగొండ, మన చౌరాస్తా :** అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె.వి కృష్ణవేణి అన్నారు. బుధవారం స్థానిక టీఎన్జీవో కార్యాలయంలో జిల్లా అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. అంగన్‌వాడీల పెండింగ్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అన్నారు. అంగన్వాడీలు సక్రమంగా విధులు నిర్వహించి, చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి మాట్లాడుతూ అంగన్‌వాడీల జీతం పెంచేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. రాష్ట్ర కన్వీనర్ నామిరెడ్డి నిర్మల మాట్లాడుతూ ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లను, ఆయాలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు జొన్నలగడ్డ వెంకటరమణ, కార్యదర్శి మజ్జిగపు సునీత, కోశాధికారి పుట్ట సునీత, సీడీపీవో మమత అసోసియేషన్ ప్రెసిడెంట్ శశికళ, కుర్షితా బేగం, రజియా సుల్తానా, శిరీష, లక్ష్మి, రాజ్యం, కౌసర్, టీఎన్జీవో నాయకులు జయరావ్, సైదులు, రణదీవే పాల్గొన్నారు.




## కడవేర్గు జడ్పీ స్కూల్‌లో స్వయం పాలన దినోత్సవం

**చేర్యాల, మన చౌరాస్తా :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కడవేర్గులో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే వివిధ హోదాలలో అంకితభావంతో పనిచేసి మెప్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బత్తుల కార్తీక్, జిల్లా విద్యాశాఖాధికారిగా కొమిరె మధు, ఉపాధ్యాయులుగా అభిషేక్, తరుణ్, సాయిరాం, సాత్విక, సహస్ర, అమ్ములు, భానుప్రసాద్, శిరీష, శివాని, రాజేశ్, సంజన, మహేష్, సంజయ్, సిద్దేశ్వర్ తదితరులు తమతమ పాత్రలు పోషించారు. తదనంతరం జరిగిన సమావేశంలో తాము చక్కని అనుభవాన్ని సంపాదించుకున్నామని విద్యార్థులు తెలియజేసారు. పాఠశాల నిర్వహణలో ఉపాధ్యాయ వృత్తితో పాటు అటెండర్ లాంటి వృత్తి కూడా ప్రధానమైనదని ప్రధానోపాధ్యాయులు పి.చంద్రశేఖర్ రావు అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వి.రమేశ్, కృష్ణమూర్తి, లింగయ్య, రామకృష్ణ, కాంతీకృష్ణ, మమత, సాజీదా, అరుణ, ప్రీతి, సీఆర్‌పీ రవీందర్, దినేశ్, రమేశ్ ,చంద్రశేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు.



# 16న స్టేషన్‌ఘన్‌పూర్‌కు సీఎం

- వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- సీఎం పర్యటన వివరాలు వెల్లడించిన ఎమ్మెల్యే కడియం

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** ఈనెల 16న సీఎం రేవంత్ రెడ్డి స్టేషన్‌ఘన్‌పూర్‌కు రానున్నారని, ఈ పర్యటనలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నేతలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల సమయంలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే సమయం ఆసన్నమైందన్నారు. ఈ నెల 16న దాదాపు రూ.800 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. మార్చి 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గానికి మంజూరైన రూ.800 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం భారీ బహిరంగ సభలో పాల్గొంటారని అన్నారు. మార్చి 7, 8, 9, 10, 11వ తేదీలలో మండల ముఖ్య నాయకులు మండలంలోని అన్ని గ్రామాలలో పర్యటించాలని తెలిపారు. ప్రతీ గ్రామంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించి గ్రామ సమస్యలపైన, అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన విషయాలపైన చర్చించాలని సూచించారు. అలాగే నియోజకవర్గంలో మరియు మండలంలో మంజూరు అయిన అభివృద్ధి పనులను కార్యకర్తలకు వివరంగా చెప్పాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరించాలని అన్నారు. గ్రామంలో పాత, కొత్త అనే బేధం లేకుండా అందరిని సమన్వయం చేయాలని తెలిపారు. ప్రతీ గ్రామంలో 15 మందికి తగ్గకుండా యువజన, మహిళా కాంగ్రెస్ కమిటీలను అలాగే 5 మందికి తగ్గకుండా సోషల్ మీడియా కమిటీలను ఏర్పాటు చేయాలని ఈ కమిటీల ఏర్పాటులో అందరికీ అవకాశం కల్పించే విధంగా చూడాలని సూచించారు. సీఎం గారి పర్యటన నేపథ్యంలో ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభకు 50వేల మందికి తగ్గకుండా జన సమీకరణ చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఒక్కో బూత్ నుండి 150కి తగ్గకుండా జన సమీకరణ చేయాలని తెలిపారు. ఒక్కో బూత్ కు ఇద్దరు లేదా ముగ్గురు ఇంచార్జ్ లను నియమించాలని, జన సమీకరణ, వాహనాల ఏర్పాటు బాధ్యత ఇంచార్జ్ లదే అని స్పష్టం చేశారు. నియోజకవర్గానికి మంజూరు అయిన 100 పడకల అస్పత్రి, డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్స్, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, డిగ్రీ కాలేజ్, ఘనపూర్ నుండి నవాబ్ పేట కెనాల్ సిసి లైనింగ్, పంచాయతీ రాజ్ రోడ్లు, 3సబ్ స్టేషన్లు, డీఈ ఆఫీస్, బంజారా భవన్ తో పాటు జనవరి 26న 4 నాలుగు సంక్షేమ పథకాలను మండలానికి ఒక గ్రామంలో ప్రారంభించిన గ్రామాలకు మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా సీఎం గారిని నియోజకవర్గ అభివృద్ధికి ఎక్కువ నిధులు కోరడం జరుగుతుందని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి పర్యటించలేదని అన్నారు. మొదటి సారిగా నియోజకవర్గానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి బహిరంగ సభ ద్వారా ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నాయకులు చౌకబారు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ లబ్ది కోసం ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని అన్నారు. పని లేని వారితో పెట్టుకొని నా సమయాన్ని వృధా చేసుకొనని, నా ఎజెండా కేవలం నియోజకవర్గ అభివృద్ధి మాత్రమేనని స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టుతో సాధ్యమైనంత వరకు సాగు నీరు అందిస్తున్నానని తెలిపారు. జీడికల్ వరకు గోదావరి జలాలు తీసుకురాగలిగాని పసలేని మాటలు మాట్లాడే వారు ఒకసారి జీడికల్ వెళ్లి చూడాలని హితవుపలికారు. ప్రతీ ఒక్కరూ సహకరించి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, మార్కెట్ చైర్‌పర్సన్ లావణ్య శిరీష్ రెడ్డి, దేవస్థానం చైర్మన్ శ్రీధర్ రావు, బ్రహ్మారెడ్డి, నరేందర్ రెడ్డి, బూర్ల శంకర్, బెల్లీదే వెంకన్న, వెంకటేశ్వర్ రెడ్డి, లింగాజి, దిలీప్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మామిడాల లింగారెడ్డి, ఇల్లందుల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపోలు శివ చరణ్ రెడ్డి, పోగుల సారంగపాణి, లక్ష్మారెడ్డి నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు ప్రమాద బీమా అవసరం

- భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి, మన చౌరాస్తా :** జర్నలిస్టులకు వ్యక్తిగత ప్రమాద బీమా అవసరమని, టీఎస్‌జేయూ జర్నలిస్టులకు ప్రమాద బీమా అందించడం అభినందనీయమని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీ.ఎస్.జె.యు) ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ శర్మ చేతుల మీదుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా జర్నలిస్టులకు వ్యక్తిగత ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, ఎస్‌యూజే (ఐ)జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్ ఆధ్వర్యంలో టీఎస్‌జేయూ జిల్లా కమిటీ సభ్యులు కలసి జర్నలిస్టుల దాడులకు సంబంధించిన కమిటీని పునరుద్ధరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జర్నలిస్టులకు టీ.ఎస్.జె.యు ఆధ్వర్యంలో రూ.5 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా ఇవ్వడం సంతోషకరమన్నారు. విధి నిర్వహణలో రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా వార్తా సేకరణలో భాగంగా ఎంతో మంది జర్నలిస్టులు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. అలాంటి సమయంలో వీరికి ప్రమాద బీమా ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. టీఎస్‌జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రభుత్వ కల్పించే సంక్షేమ పథకాల్లో జర్నలిస్టులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరారు. హెల్త్ కార్డులు అన్ని కార్పొరేట్ హాస్పిటల్లో పని చేసే విధంగా చొరవ తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు గట్టు రవీందర్, సంయుక్త కార్యదర్శులు పల్నాటి రాజు, కడపాక రవి, కోశాధికారి సంగెమ్ శేఖర్, ఆర్గనైజ్ సెక్రెటరీ మారేపల్లి చంద్రమౌళి, బొల్లపెల్లి జగన్, ఈసీ మెంబర్లు కె.దేవేందర్, మీడియా ఇంచార్జి కార్నూరి సతీష్ పాల్గొన్నారు.

# స్వామివారికి ఇత్తడి నేమ్ ప్లేట్లు బహూకరణ

స్టేషన్ ఘన్ పూర్, మన చౌరాస్తా : జనగామ జిల్లా చిల్పూర్ మండలం శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి జనగామ జిల్లా నెల్లుట్లకు చెందిన దోర్నాల మనోహర్ స్వామి అండల్, కడవేర్లు రవీందర్ రమాదేవి (శ్రీదేవి భూదేవి) రూ.20 వేల విలువ గల ఇత్తడి నేమ్ ప్లేట్లు స్వామివారికి బహూకరించినారు. ఈవో లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించి ఈ కార్యక్రమంలో చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, జూనియర్ అసిస్టెంట్ మోహన్, అర్చకులు రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



# హై ఆల్టిట్యూడ్ మెడల్‌కు ఎన్నికైన కరీంనగర్ సైనికుడు



**కరీంనగర్, మన చౌరాస్తా :** ఆర్మీ లో వేల మంది సైనికులు దేశ సరిహద్దుల్లో వివిధ ప్రదేశాల్లో పని చేస్తుంటారు.అలా పనిచేసే ప్రదేశాల్లో అత్యంత క్లిష్టమైన ఏరియా హిమాలయాలు. రక్తం గడ్డ కట్టుకుని పోయే మైనస్ డిగ్రీల చలిలో డ్యూటీ చేయడమంటే ప్రాణాలతో చెలగాటమే. అలాంటి హిమాలయాల్లో 9 వేల అడుగుల పైన ఎత్తులో డ్యూటీ చేయడమంటే ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. అలాంటి సాహసోపేతమైన విధులు నిర్వహించిన సరిహద్దు దళాల సైనికులకు ఇచ్చేదే హై ఆల్టిట్యూడ్ మెడల్.1986 నుంచి ఈ అవార్డు ప్రధానం చేయడం ఆనవాయితీగా ఉంది. తెలంగాణ నుంచి కరీంనగర్ నివాసి ఆడేపు వెంకటరమణ ఈ మెడల్‌కు అర్హత సాధించారు. కరీంనగర్ పట్టణం జమ్మికుంటలో నివాసముండే ఆడేపు రాజయ్య, అన్నపూర్ణ కుమారుడు ఆడేపు వెంకట రమణ. చిన్నతనం నుంచి కష్ట పడి చదువుకుని సైన్యంలో చేరాలనే ఉత్సాహంతో ఇంటర్ మీడియట్ విద్య ముగియగానే ఆర్మీ సెలక్షన్‌లో ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ లో సైనికుడిగా విధుల్లో చేరారు. ఎంతో అంకిత భావం, దేశ భక్తితో విధులు నిర్వహిస్తూ హవాల్దర్‌గా ఎదిగారు. ప్రస్తుతం ఇండో చైనా సరిహద్దుల్లో గడ్డ కట్టే చలిలో 9 వేల పైన అడుగుల ఎత్తులో విధులు నిర్వహించి హై ఆల్టిట్యూడ్ మెడల్‌కు అర్హత సాధించారు. ఆగస్టు 15న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదగా ఈ అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ,మిత్రులు సంతోషం వ్యక్తం చేశారు.